# పేటేరు

- తిరువీధుల రామకృష్ణ, బూదాటి లావణ్యేశ్వర రావు




"వేసవి రాత్రులు అంటే చాలు రోజూ ఆరుబయట మంచాలు వేసుకుని నక్షత్రాలను చూస్తూ చెట్లకింద పడుకునేవాళ్ళం. వెన్నెల రోజుల్లో అయితే మంచం మీద కూర్చునే భోజనం, ఒక్కోసారి అమ్మే అందరికి కలిపి పెట్టేది. చిన్నపిల్లలకు అలా వెన్నెలలో చందమామను చూపిస్తూ తినిపించడం చూడ చక్కని దృశ్యం. ఆ రోజుల్లో రాత్రి 2 గంటలప్పుడు గంట కొడుతూ జంగం దేవర వచ్చేవాడు. పొడవాటి తెల్లటి డ్రస్సు, పొడుగు జుట్టు, చేతిలో గంట కొడుతూ ఇంటింటికీ తిరిగేవాడు....."

కల లాంటి నిజంలోకి నా అనుభవాల లోతులలోకి..

మావూరి జ్ఞాపకాలలోకి...

సుజనరంజని పాఠకులకి ఉగాది శుభాకాంక్షలు. క్రొత్త సంవత్సరం అనగానే గడచిన రోజులు, జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ భవిష్యత్తుకు స్వాగతం పలుకుతాం. ఈ సందర్భంలో పుట్టి పెరిగిన ఊరుని, బాల్యం మిగిల్చిన మధురానుభూతులను గుర్తు చేసుకోవడం చాలా సంతోషం. ఎందుకంటే అమ్మ ఒడిని, పెంచిన ఊరుని గుండెలోతుల్లో ఎప్పుడు తలుచుకున్నా సమయం తెలియదు. ఈ మధురానుభూతులను మీతో పంచుకునే అవకాశం సుజనరంజని ద్వారా కలగడం నా అదృష్టం. రేపల్లె తాలూకా, గుంటూరు జిల్లాలో ఒక ప్రశాంతమైన కృష్ణా నదీ ప్రాంతం. రేపల్లె అంటే వ్రేపల్లె కాకపోయినా అక్కడి పల్లెల వాతావరణం మాత్రం తెలుగు సంస్కృతికి ఒక అందమైన ఉదాహరణ. రేపల్లె నుంచి ఎర్రబస్సు ఎక్కి తెనాలి గాని, గుంటూరు గాని వెళ్ళాలంటే మా ఊరి మీదుగా వెళ్ళాల్సిందే రేపల్లె ఊరి పొలిమేరలు దాటంగానే ఎడమవైపు పచ్చని పొలాలు కుడి వైపు జంట చెరువులు దర్శనమిస్తాయి. ఒక చెరువులో అన్నీ తామరపూలు ఇంకో చెరువులో అన్నీ కలువపూలు చూడముచ్చటగా ఉంటాయి. అవే రేపల్లెకు పేటేరుకు సరిహద్దులు. అవి దాటితే కుడి వైపు బావాజీ తోట. ఎడమ వైపు శ్రీ అంజనేయ స్వామి గుడి పలుకరిస్తాయి. నాలుగు అడుగులు వేస్తే రెండు పంట కాలువలు ఉంటాయి. ఆ ప్రదేశమంతా మొగలిపూల వాసనతో నిండివుంటుంది




ఇంకొంచెం ముందుకొస్తే మూడు మర్రి చెట్లు ఒక వైపు, విష్ణ్వాలయం గుడి గోపురం ఒక వైపు స్వాగతమిస్తాయి. అదే పేటేరు సెంటరు. అక్కడే బస్ స్టాపు. ఊరి సెంటరులో ఉన్న మూడు మఱ్ఱి చెట్లకు ఎత్తు అరుగులు ఉంటాయి. అవే రచ్చ బండలు. ఊళ్ళో వాళ్ళంతా రోజుకొకసారయినా వచ్చి




నలుగురుతో వార్తలు, విశేషాలు మాట్లాడందే నిద్రపోయే వాళ్ళు కాదు. అక్కడే ఉన్న పంచాయతీ ఆఫీసులో వార్తా పత్రికలు చదువుతూ రాజకీయాల గురించి చర్చ ఎప్పుడూ జరుగుతూనే ఉండేది. ఎదురుగా టీ, కాఫీలు, సాయింత్రం అయితే వేడి వేడి పునుగులు, బజ్జీలు తిని కబుర్లాడుకుంటూ కాలం గడిపే



పేటేరు సెంటరు

వాళ్ళం. చుట్టు పక్కల ఊళ్ళలోని వార్తలన్ని అక్కడికొస్తే తెలుస్తాయి. పుట్టినప్పటీనుండి హైదరాబాదుకు ఉద్యోగం కోసం వెళ్ళే వరకూ నా అనుబంధం ఈ ఊరితోనే. హైదరాబాదు వెళ్ళిన తరువాత కూడా చాలా ఏళ్ళు పొద్దునే లేస్తే మా ఊర్లో మా ఇంట్లో నిద్ర లేచినట్లుగా ఉండేది

ఇంతకీ మా వూరు విశేషమేమిటంటే నేత చీరలు , కోడి పందాలు , తాటాకు టపాకాయలు, తాడెత్తు ప్రభలూ, ప్రతి పండుగనూ ఉత్సా హంగా జరుపుకునే జనం, పౌరాణిక



అందమైన చీరలు తయారైయేదిలానే

సాంఘిక నాటకాలతో ఎప్పుడూ సందడిగా ఉండే రాత్రులు. ఇలా చెప్పుకుంటూ పొతే చాలా విశేషాలున్నాయి....

## చేనేత చీరలు

దాదాపు పదివేల జనాభా కలిగిన మా ఊరిలో అరవై శాతం మంది చేనేత పనివాళ్ళు. పేటేరు చీరలంటే గుంటూరు జిల్లాలో చాలామందికి తెలుసు. పేటేరు చీరలు తప్ప వేరే చీరలు కట్టని కుటుంబాలు వుండేవంటే అతిశయోక్తి కాదు. నూరు, నూట ఇరవై నంబరు దారంతో తయారు చేసే కాటను చీరలు వొంటికి హత్తుకుని చాలా తేలికగా ఉండేవి. అబ్బో ఎన్ని రంగులు, ఎన్ని డిజైనులు! చూసి తీరాల్సిందే. జరీ చీరలు మరీ ప్రత్యేకం. గళ్ళ లుంగీలు, ఖద్దరు పంచెలు కూడా ప్రసిద్ది. దసరాబుల్లోడు లాంటి రకరకాల సినిమా పేర్లతో డిజైనులు మారుస్తూ కుర్రకారుని గళ్ళ లుంగీలు చాలా కర్షించేవి. ఇక ఈ పని చేసే కుంటుంబాల్లో ఆడవాళ్ళు మగవాళ్ళు కలిసి పనిచేసే విధానం చూడ ముచ్చటగా ఉంటుంది. రేడియో వింటూ వీలయిన సమయాలలో పనిచేసే అవకాశం ఇలా పల్లె సీమల్లోని చేతివృత్తుల వారి కుండేది. ఇప్పుడు పట్టణాల్లో, నగరాల్లోని ఉద్యోగస్తులకంటే ఇది ఎంతో నయం కాదా!. ఇంటిల్లిపాదీ కలిసిచేసే ఈ చేతి వృత్తులుగాని, పొలం పనులుగాని సహజీవన సౌందర్యానికి అద్దం పడతాయనిపిస్తుంది.



గెలిచేది నువ్వా నేనా?

## కోడిపందేలు

మావూరి కోడి పందాల చరిత్ర గమనిస్తే అది క్రికెట్ చరిత్రకంటే తక్కువేం కాదనిపిస్తుంది. సంక్రాంతి పండుగకు జోరుగా సాగే కోడిపందాలు చాలా ప్రొఫెషనల్‌గా ఉండేవి. కోడిపందాలంటే కోడిపుంజులు రెండు ఒక కాలికి కత్తి కట్టుకుని పోరాడే పోటి. ఈ పందాల కోసం సంవత్సరమంతా

కోళ్ళను చాలా మంది ఇళ్ళల్లో పెంచేవారు. కోడి పుంజులలో చాలా రకాలు ఉంటాయి. నెమలి, డేగ ఇలా. ఏ కోడిని పడితే కోడిని పందానికి వేయరు. దానిని ప్రత్యేకంగా పెంచాలి. దానిని సరైన జోడితోనే పందెం వెయ్యాలి. ప్రతికోడి తరుపున, పందేనికి ముందు, చూడటానికి వచ్చిన వాళ్ళందరు డబ్బులు పందేలు కాసేవాళ్ళు. పందెం కొన్ని నిమిషాలనుంచి కొన్ని గంటలవరకూ జరగవచ్చు. ఇవి ఒక్కోసారి 2,3 రోజులు జరిగేవి. కోడిపందెంలో చాలాసార్లు ఒక కోడి పుంజును ఇంకో కోడి పుంజు గాయ పరిచి చంపేసేది. గాయపడినా పౌరుషంగా పోట్లాడే ఈ కోడిపుంజులను చూడటమే వీటిలోని సరదా. ఈ పందేలు సంక్రాంతి నెలలోనే కాదండి, మిగతా పండుగ రోజుల్లో కూడా వేసేవాళ్ళు. సంక్రాంతి కనుమ రోజైతే ఊరిలో మగవాళ్ళందరూ అక్కడే ఉండేవాళ్ళు. ఈ కోడిపందేలకి పంచాయతీ ప్రెసిడెంటు లాంటి వాళ్ళు నాయకులుగా వుండటం కొసమెరుపు. కోడిపందెంలో గెలిచిన కోడి మాంసం రుచి చూస్తేమీరు మళ్ళీ ఎప్పుడూ మరచిపోరు.

### నాటకాల పిచ్చి

పౌరాణిక నాటకాలన్నా, సాంఘిక నాటకాలన్నా మా వూరి జనానికి మహా ఇష్టం. ఏడాది పొడుగునా రకరకాల నాటకాలు జరుగుతూనే ఉండేవి. ఆరుబయట పెద్ద ఖాళీ ప్రదేశంలో స్టేజి కట్టి వేసే ఈ నాటకాలు, రాత్రి పదింటి తరువాతే మొదలయ్యేయి. అద్భుత రాగాలాపనకు ఒన్స్ మోర్ కొడుతూ తెల్లవారుఝామున నాలుగు అయిదు గంటల వరకు చూసే వాళ్ళం. సత్య హరిశ్చంద్ర, శ్రీ కృష్ణరాయభారం, చింతామణి, బాలనాగమ్మ, పల్నాటి యుద్ధం లాంటి పౌరాణిక నాటకాలు, రక్త కన్నీరు, అల్లూరి సీతారామరాజు,రంగూన్ రౌడి మొదలైన సాంఘిక నాటకాలు రసవత్తరంగా నడిచేవి. అక్కడ వుండే సందడి , ఆ ఉత్సాహం ఈ నాడు థియేటర్లో 2, 3 గంటలు చూసే సినిమాలకు లేదనిపిస్తుంది. మా వూళ్ళోనే కాదు చుట్టుపక్కల 10 మైళ్ళ లో ఎక్కడ నాటకాలు వేసినా తప్పకుండా వెళ్ళేవాళ్ళు మా వూరిలో ఉన్నారంటే ఆశ్చర్యమనిపిస్తుంది. ప్రత్యేకంగా మా వూరి ప్రెవేట్ మాస్టారు ప్రకాశరావు గారి గురించి ఇక్కడ వ్రాయాలి. ఆయన చదువు ఎంత గట్టిగా నేర్పించేవారో అంతే ఉత్సా హంగా పిల్లలకోసం నాటకాలు రాసి శ్రీ రామ నవమి పందిట్లో వేయించేవారు. తేనె పూసిన కత్తి, చెవిటి మాలోకం, దేవుడూ నీకు దిక్కెవరు నాటకాల్లో నా ఫ్రెండ్ లావణ్యేశ్వరరావు ముఖ్య పాత్రలు ధరించాడు. నాటకాలు వేసిన వాళ్ళలో మా పెదనాన్న, అన్నయ్య, చుట్టాలు చాలామంది ఉన్నారు. ఈ నాటకాల ప్రాక్టీసుకు వెళ్ళడం నాకు చాలా సరదాగా ఉండేది. మాయల ఫకీర్ నవ్వు కోసం వాళ్ళు కొన్ని వారాలు ప్రాక్టీసు చేసేవాళ్ళు. అలాంటి ప్రజల జీవనంలో భాగంగా ఉండే ఈ నాటకాలను మనం ఈ రోజున ఆదరించడం మరచిపోతున్నాం. సిగ్గుపడకుండా అందాలను ఒలకపోయుటం తప్ప ఏమీ రాని

ఆడవాళ్ళను హీరోయిన్లు గా, డైలాగ్ సరిగా చెప్పడం కూడా రాని వాళ్ళను హీరోలుగా తీసే సినిమాలను ఆదరిస్తూ కళను దిగజారుస్తున్నామేమో ఆలోచించండి

### ఊరంతా సంబరాలు

ఫిబ్రవరినెలలో ప్రతియేటా జరిగే శ్రీ భావనా రిషి స్వాముల వారి తిరునాళ్ళు చాలా చెప్పుకోవలసిన విశేషం. ఏడురోజుల పాటు ఊరంతా పాల్గొని చేసే ఈ వేడుకల్లో వెల్లి విరిసే ఉత్సాహం చూడవల్సిందే గెరటి గుడ్డ ఎగురవేసినరోజు మొదలయ్యి, రంగుల హోళీతో ముగిసే వరకూ ఊరినుంచి ఎవ్వరూ బయటకు వేరే ఊరికి వెళ్ళేవాళ్ళు కాదు. రంగుల పల్లకిలో ఊరేగే ఎదురుకోల, అమ్మవారిని కలిసిన స్వామికి జరిగే



భావనారిషి స్వామి గుడి

కళ్యాణం, రధోత్సవం, దివిటీలతో పండగ, ఒకరికొకరు రంగులు పులుముకుంటూ దేవుడిని ఊరేగిస్తూ ఊరి చివరి చెరువులో స్నానాలు చేయడం ప్రతివారికి వింత అనుభూతి. అన్ని ఊళ్ళనుంచి ఊరి ఆడపిల్లలు అత్తవారి ఊరునించి ఈ

తిరునాళ్ళకు తప్పనిసరిగా వచ్చేవాళ్ళు. గుడిముందు రోడ్డంతా తాటాకు పందిళ్ళు వేసి, రోజూ నాటకాలు, హరి కథలు...మొదలగు వాటితో అలరిస్తూ పిల్లలకు రకరకాల బూరలు, నీటిబంతులు, టమటమాల వంటి ఆటవస్తువులు అమ్మే వాళ్ళతో ఆ ప్రదేశం కళ కళ లాడుతూ ఉండేది. తరువాత శ్రీ రామ నవమి, దసరా పండుగలు కూడా చాలా భారీగా చేసేవాళ్ళు. కార్తిక మాసంలో అందరూ కలసి ఉసిరి తోటల్లో జరుపుకునే వనభోజనాలు నాకు ఎప్పటికీ మరుపురాని అనుభూతులు.

## పండుగలు


ముంగిట్లో ముగ్గులు

ప్రతి పండుగా ప్రత్యేకమే. ప్రొద్దున్నే లేచి తోటలోకెళ్ళి దర్భలు తెచ్చి వినాయక చవితికి దేవునికి పూజ చేసేవాళ్ళం. చేసిన ఉండ్రాళ్ళు వేరే ఇంటికి విసిరివేయడం చాలా సరదా. ముక్కంటి ఏకాదశికి నెలరోజుల ముందు నుంచే మేము నూనె దీప స్తంభం తీసుకుని ఇంటింటికి వెళ్ళి భజన చేస్తూ డబ్బులు తెచ్చి పండుగ రోజంతా ఉపవాసం ఉండి వేడుకగా జరిపే వాళ్ళం. సంక్రాంతికి అయితే ఇక చెప్పక్కర్లేదు. నెల పట్టిన రోజు నుంచి రోజూ ముగ్గులు, గొబ్బెమ్మలతో వాకిళ్ళు నిండేవి. హరిదాసులు చాలా మంది మా వూరికి ఈ నెలలో వచ్చి ఉండేవాళ్ళు. ఆదివారం వస్తే వాళ్ళ వెంబడే కనీసం వంద ఇళ్ళయినా తిరిగి వచ్చే వాళ్ళం. వాళ్ళు రాగ యుక్తంగా పాట పాడుతూ చెక్క భజన చేస్తూ పిల్లలను ఉత్సాహపరుస్తూ తిరిగే వాళ్ళు. హరిదాసులు, గంగిరెద్దులు, కొరడాలతో వంటిమీద కొట్టుకునే వాళ్ళు చాలా మంది ఇంటింటికి వచ్చే


రావమ్మా! మహాలక్ష్మి! రావమ్మా....

వాళ్ళు. అలాగే భోగిమంట కోసం ముందు రోజు రాత్రంతా కట్టెలు ప్రోగుచేసే వాళ్ళం. ఎవరింట్లో కొట్టెయ్యాలా అని ముందుగానే ప్లాన్ చేసేవాళ్ళం. రాత్రికి రాత్రి దొంగిలించి భోగిమంటలో వేసేవాళ్ళం. తెల్లారి అందరూ భోగిమంటలో చలి కాసుకోవడానికి వచ్చే వాళ్ళు. వాళ్ళ ఇంట్లో కట్టెలు,


భోగి మంటలు

దుంగలు మంటలో చూసి ఒకటే తిట్లు. భోగి మంటలు పిల్లలకు సరదాగా ఉండేవి. అవి చలి రోజులు కాబట్టి రోజూ గడ్డితో పొద్దున్నే చలి మంటల దగ్గర వెచ్చగా కూర్చోవడం భలేగా ఉండేది. దీపావళికి ఒక నెలముందు నుంచే ఏర్పాట్లు జోరుగా ఉండేవి. తాటాకు టపాకాయలు తయారు చేయడం మావూరి వారికి ప్రత్యేకం. పావు, అర, నిండు అని మూడు సైజులలో దొరికేవి. నిండు కాయ పేల్చడానికి చాలా ధైర్యం కావాలి. ఎందుకంటే ఇంటిగోడ కూడా పడగొట్టే శక్తి దానికుంది. గుంటూరు, తెనాలి తదితర వూళ్ళ నుంచి వచ్చి

కూడా ఈ టపాకాయలు కొనేవాళ్ళు. ఊరి సెంటర్లోని కిళ్ళీ కొట్లో ఇవి అమ్మే వాళ్ళు. పిల్లలు రజనుతో తూనీగలు, నేల టపాకాయలు, రంపపు పొట్టుతో పూల పొట్లాలు తయారు చేయడంలో మునిగే వాళ్ళు. నెలరోజులు ఊళ్ళో పొద్దున్నుంచి రాత్రి దాకా టపాకాయలు మ్రోగుతూనే ఉండేవి. అవి తయారు చేస్తూ చేతి వేళ్ళు, కాలి వేళ్ళు పోగొట్టుకున్నవాళ్ళు చాలా మందే ఉన్నారు. ఒకసారి నేనూ, ఫ్రెండ్ మధుతో కలిసి నేల టపాకాయలు చేస్తుంటే కాలి వాడికి మొహం కాలటమే కాదు, 20 రోజులు కళ్ళు కనపడలేదు. అప్పటినుంచి అవి తయారు చేయడం అంటే భయం. దీపావళి రోజు రాత్రి పేటేరు సెంటరులో అవ్వాయి సువ్వలనే రాకెట్లతో పోటీలు జరిగేవి. వాటిని నేలబారుగా వేసేవాళ్ళు. అవి ఒక్కోసారి పంచెలు, చీరలు కూడా కాల్చేవి. ఊర్లో ఉన్న రాజయోగ ఆశ్రమంలో పెద్ద ఎత్తు నరకాసురుణ్ణి కాల్చడం, 'ఓం' ఆకారంలో దీపాలు వెలిగించడం గొప్ప అనుభూతి. పండగ రోజులలో ప్రతి ఇంట పిండివంటలు, కొత్త బట్టలు, ఆడపిల్లలను అత్తగారింటినించి పిలవడం, ముందురోజు నలుగు పెట్టి స్నానం చేయడం, ఆడపిల్లలు గోరింటాకులు ఇలాంటి సరదాలు చాలావుండేవి. కొత్త అల్లుళ్ళున్న ఇల్లయితే ఇంకా సందడి. బావలను మరదళ్ళు ఏడిపించే ప్రయత్నం, అల్లుళ్ళు మామ గారి మీద అలక ఇలాంటివి కుటుంబంలో అనురాగాల సరాగాలకు అద్దం పట్టేవి. అట్ల తద్ది ఆడపిల్లలకు ప్రత్యేకం. తెల్లవారు ఝామున మసక వెలుతురులో లేచి రాత్రి పెట్టిన గోరింటాకు ఎలా పండిందో అందరికి చూపించి, తెల్లవారకముందే అమ్మ చేసిన అట్లు తినడం ఒక సరదా


శివాలయం

అయితే తాడి చెట్టుకూ, వేప చెట్టుకూ వేసిన పెద్ద పెద్ద ఉయ్యాలలు ఊగడం, ఊపడం ఎంతో బాగుండేది. ఇంట్లో అందరూ కలిసి అరిసెలు, బూరెలు, జంతికలు చేసుకుని వేరేవాళ్ళతో పంచుకోవడం ఆనవాయితీగా ఉండేది.

## శివరాత్రి

ఈ పండుగకు 6 కిలోమీటర్ల దూరంలోని అరవపల్లిలోని శివాలయం దగ్గర తిరనాల జరిగేది. ముందురోజునించే అన్నిగ్రామాలనుంచి వాళ్ళ, వాళ్ళ ఆవులు,గేదెలు, మేకలు, గొర్రెలను రంగులతో అలంకరించి తీసుకుని వెళ్ళి గుడి చుట్టూ తిప్పే వాళ్ళు. హర హరా అంటూ ప్రవాహంలా కదలి వెళ్ళేవాళ్ళు. ఇక పెద్ద పెద్ద ప్రభలు అలంకరించి ఎడ్ల బండ్ల మీద రికార్డింగ్ డ్యాన్స్ లతో తీసుకు వెళ్ళడం విశేషంగా ఉండెది. పేటేరు ప్రభ అంటే పెద్ద పేరు. దాదాపు 40 అడుగుల ఎత్తుతో, 7,8 ఎడ్ల బండ్ల మీద తీసుకు వెళ్ళే ఈ ప్రభ ఒక ప్రత్యేక ఆకర్షణ. దానిని తయారు చేయడం ఒక ఎత్తయితే, దాన్ని అడ్డదారుల్లో కరెంటు తీగలు తొలగిస్తూ తీసుకెళ్ళడం మరో ఎత్తు. జనరేటర్ లైట్లు, రికార్డింగ్ డ్యాన్స్‌లు ఎప్పుడు ఉండేవి.

## చిన్నప్పటి ఆటలు

మట్టి ఇళ్ళలో పుట్టి పెరిగిన మాకు, వీధులు, వాకిళ్ళు అన్నీ ఆటస్థలాలే. బొంగరాలు, గోళీలు, సిగరెట్టు పెట్టెలతో ఆడే ఓకులు, బచ్చాలాట, బిళ్ళంగోడు, 5 రాళ్ళు, కో కో, కుంటాట ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో !! బొంగరం పగిలిపోయేలా సీరియస్ గా ఉండేది బొంగరమాట. గోలీలతో, కంచాలతో ఎన్నో ఆటలు. గోళీలలో ఎన్నో రకాలు - పించం, బిళ్లేలు, సోడా బుడ్డి ఇలా ఎన్నో. గోళీలు ఎక్కువ ఉన్నవాడికి ఊరంతా పేరుంటుంది. అవే కాక గాలి పటాలు ఎగురవేయడం చాలా బాగుండేది. మా ఫ్రెండు బాబు 4 అడుగుల ఎత్తు రింగిణీ చేసి పక్కనే ఉన్న పొలాలలో కంటికి కనపడనంత దూరం ఎగుర వేసే వాళ్ళం. ఒక్కోసారి రెండు రోజులదాకా దాన్ని దించే వాళ్ళం కాదు. అప్పుడప్పుడూ చిత్రమైన పోటీలు వేసేవారు. రోడ్డు మీద నిమ్మకాయని ఎవరెక్కువ దూరం వేయగలరని ఒక పందెం, పేటేరు చెట్టు నుంచి రేపల్లె చెట్టు దాకా సైకిలు మీద దిగకుండా రెండు

గంటలలో ఎన్ని కొబ్బరికాయలు తీసికెళతారని ఇంకో పందెం. ఇం కా ఇలా ఎన్నో పందేలు జరిగేవి. వర్షాకాలం వస్తే పచ్చీసు, కాగితం పడవలు, పాముపటం, ఈతగింజలతో - ఆటలు ఇంట్లోనే ఆడేవాళ్ళం. పంట కాలవల్లో ఈతకొట్టేవాళ్ళం. మా ఫ్రండ్ శంకర రావు రోజూ హైస్కూలు నుంచి మాతో పాటు ఇంటికి వస్తూ కృష్ణానది నుంచి వచ్చే పంటకాలవలో ఈత కొట్టకుండా ఇంటికెళ్ళేవాడు కాదు. నాకు మాత్రం భయంగా ఉండేది అంతటి ప్రవాహం ఉన్న నీళ్ళలో దిగాలంటే. పెద్దవాళ్ళు సరే సరి చాలామంది కలిసి పేకాటలు జోరుగా ఆడేవాళ్ళు.

### వేసవి వినోదం

అన్ని కాలాలకు ప్రత్యేకత ఉన్నా, వేసవి కాలం మరీ ప్రత్యేకం. స్కూలుకు సెలవులేమో బోలెడు ఆటలు. దాంతో పాటు బంగినపల్లి, నూజివీడు రసాలు లాంటి మామిడి పండ్లు, తాటి ముంజెలు, కొబ్బరి బొండాలు వాటికి సీజన్. పచ్చడి మామిడి రాగానే, ఆవకాయ పెట్టి వేడి వేడిగా మొదటి రోజే తింటే ఉంటుంది మజా. అబ్బో ఆ రుచే వేరు. జామకాయలు, మొక్కజొన్నలు, సపోటాలు, ఇలా అన్ని రకాలు అప్పుడే చెట్టునుండి కోసిన కాయలు ఇంటికి వచ్చేవి. పక్కనే ఉన్న పొలాలలో పండించిన వంకాయలు, రామ ములగకాయలు, బెండ కాయలు, కోసిన వెంటనే కూర వండి తింటే, ఆరుచే వేరు. రోట్లో నూరిన గోంగూర పచ్చడి, మట్టికుండలలో పెరుగు అబ్బో!! జున్నుపాల రుచి అద్భుతం. ఆ అదృష్టం ఇప్పుడు నగరాలలో ఉన్నవారికి సున్నా. మాంచి ఎండలప్పుడు కుండల్లో నీళ్ళు తాగితే హాయిగా ఉండేది. ఈ నాటి రిఫ్రిజిరేటర్ వాటరికి ఆ రుచెక్కడిది. వేసవి రాత్రులు అంటే చాలు రోజూ ఆరు బయట మంచాలు వేసుకుని నక్షత్రాలను చూస్తూ చెట్లకింద పడుకునేవాళ్ళం. వెన్నెల రోజుల్లో అయితే మంచం మీద కూర్చునే భోజనం, ఒక్కోసారి అమ్మే అందరికి కలిపి పెట్టేది. చిన్నపిల్లలకు అలా వెన్నెలలో చందమామను చూపిస్తూ తినిపించడం చూడ చక్కని దృశ్యం. ఆ రొజుల్లో రాత్రి 2 గంటలప్పుడు గంట కొడుతూ జంగం దేవర వచ్చేవాడు. పొడవాటి తెల్లటి డ్రస్సు, పొడుగు జుట్టు, చేతిలో గంట కొడుతూ ఇంటింటికీ తిరిగేవాడు.

### పెళ్ళిళ్ళు

పెళ్ళి అంటే 16 రోజుల పండుగ. ఈనాడు 16 గంటలు కూడా ఉండటం లేదు. పెళ్ళి అంటె చాలారోజుల నుంచే ఏర్పాట్లు ఉండేవి. ఇల్లు బాగు చేసుకుని రంగులు వేయడం, వడియాలు పెట్టడం, పసుపు కొట్టడం, చుట్టాలను పిలవడం, రోజూ పెళ్ళి కూతురు లేక పెళ్ళి కొడుకుని చేసే పేరంటం లో పాటలు, సరదాలు చాలా హడావిడి. ఆత్మీయత అనుబంధాలకు పుట్టినిళ్ళు ఈ గ్రామాలు. ఆడపిల్లను అత్తవారి ఇంటికి సాగనంపడం చూస్తే తెలుస్తుంది కుటుంబాల మధ్య రాగ బంధాలు. క్రొత్త కోడలు కాపురానికి వస్తే ఏర్పడే అనుబంధం ఒక్క కుటుంబంతో కాదు, వీధిలోని అందరితో. ఇప్పడు నగరాల్లో ప్రక్కవాళ్ళతో మట్లాడే అవకాశం తక్కువైపోతుంది. ఏవరిలోకం వారిది. సాయింత్రం చీకటి పడగానే 7 గంటలకే కుటుంబమంతా కలిసి భోజనం చేసి అన్ని విషయాలు మాట్లాడుకోవడం, దంపతులు కూడా రోజూ ఏకాంతంలో మనసుతీరా మాటలాడుకుంటూ గడపడం జరిగేది. ఈ రోజుల్లో అందరూ టివి చూస్తూ లేటుగా పడుకోవడం లేటుగా లేవడం ఇవన్నీ మనుషుల మధ్య, ముఖ్యంగా దంపతుల మధ్య రాగ సరాగాలకు సమయం తక్కువై దూరాన్ని పెంచుతున్నాయనిపిస్తుంది. వేసవిలో అయితే రోజూ మల్లెపూలు పెట్టుకోని ఆడవాళ్ళు అరుదు. ఈనాటి రోజుల్లో మల్లెపూలు సినిమాలలో సన్నివేశాలకే పరిమితం. జీవితాన్ని ఆస్వాదించడానికి సమయంలేక మానవ సంబంధాలలో సుగధం కరువైపోతున్నందుకు చాలా బాధేస్తుంది.

### మరిచిపోలేని దివిసీమ ఉప్పెన

మా వూరికి కృష్ణానది 3 కి.మీ. సముద్రం 10 కి.మీ. 1977 లో దివిసీమలో వచ్చిన ఉప్పెన తాకిడికి మావూరిలో సగం ఇళ్ళు, చాలా చోట్ల తోటలు నేల మట్టం. రోజు రాత్రి వీచిన గాలి, వర్షం తలచుకుంటే ఇప్పటికి భయం వేస్తుంది. కిరోసిన్ కూడా దొరకడం కష్టం అయింది. బ్రతుకే కష్టం అయింది. ఒక నెల రోజుల వరకూ బస్సులు రోడ్డు పక్క పొలాలలో పడి పోయాయి. కరెంటు స్థంభాలు అన్నీ నేలకు వంగాయి. ఆ తుఫాను దిబ్బ ఈ రోజుకూ ఊరిలో కనిపిస్తుంది. అంతే కాదు, మంచినీళ్ళ బావులు ఉప్పు నీళ్ళ బావులుగాను, ఉప్పు నీళ్ళ బావులు మంచి నీళ్ళ బావులుగాను మారాయి.

## మారుతున్న కాలం - పెరుగుతున్న దూరం

అనంత కాలగమనంలో సమాజంలో మార్పు చాలా సహజం. అలానే మా ఊర్లో చాలా మార్పులు వచ్చాయి. ఇంటింట కరెంటు, గ్యాస్ స్టవ్, మిక్సీ, టివి, స్కూటర్ ఇలా ఒకదాని తరువాత ఒకటి చేరుతున్నాయి. సాయింత్రం సెంటర్లోకి వెళ్ళి నలుగురితో మాట్లాడి, గుడిలో దేవుని దర్శించే అలవాటు ఇప్పుడీ టివి పుణ్యమా అని మరుగున పడిపోతున్నది. సినిమా మోజులో నాటకాల ఉషారు తక్కువై పోతున్నది. రోజూ ప్రొద్దున్న, సాయింత్రం వాకిళ్ళు శుభ్రం చేసి ముగ్గేసి, బిందెలతో నీళ్ళు తెచ్చి, రెండు పూటలా వంట చేయడం, పక్కింట్లో పేరంటం మొదలగు వాటితో ఎప్పుడూ నలుగురితో కలిసి మెలిసి వుండే ఆడవాళ్ళ దైనందిక జీవితం ఇప్పుడు టివి సీరియల్స్‌కి ఆరాటపడుతుంది. అంతంత మాత్రం ఆర్థిక స్తోమత ఉన్న కుటుంబాలే కాక పెద్ద ఆసాములు కూడా పిల్లలను బాగా చదివించి ఉద్యోగానికై పంపించి వాళ్ళు వెళ్ళి నగరాలలో జీవించాలని రాటపడుతున్నారు. ఇలా చుట్టాల మధ్య కాదు, ఒకే కుటుంబంలోని మనుషుల మధ్య కూడా దూరాలు పెరిగి పోతున్నాయి. ప్రకృతి ఒడిలో శాంతియుత సహజీవనానికి దోహదం చేసిన కుటుంబ వ్యవస్థకు చక్కని ప్రతిరూపంగా నిలిచిన పల్లెజీవనం ఇప్పుడు ఒక పరుగుపందెంలా మారుతోంది. సౌకర్యాల మెషీన్లు, స్టేటస్ సింబల్‌గా మారి ప్రతి మనిషినీ ధనకాంక్ష దహించివేస్తుంది. మాష్టారు ఎదురు పడితే తలవంచి నమస్కరించి, మాటకు ఎదురు చెప్పడానికి జంకే విద్యార్థులు ఈ రోజు మాష్టర్లంటే చులకన భావంతో చూస్తున్నారు. నాకిప్పటికీ బాగా గుర్తు 6వ క్లాసులో వుండగా లలిత మేడం హిందీ చెప్పేవారు. ఆవిడ వేరే వూరు ట్రాన్స్‌ఫర్ అయి వెళుతుంటే క్లాసులో సగం మంది కంటతడి పెట్టారు. అలాంటి పవిత్రమైన అనుబంధాలు కృత్రిమంగా మారాయి.

పాల డైరీ రాకతో ఊళ్ళో పాలు, నెయ్యి కరువయ్యాయి. కూరగాయలు మనుషుల లాగా నగరాలకే వలస. ఊర్లో కూరగాయల ధరలు నగరంలోని కూరగాయల ధరలతో సమానంగా పెరిగి సామాన్యుని జీవితం ఎంత సంపాదించినా సరిపోని స్థితికి తీసుకువెళుతుంది. వున్నదాంట్లో సంతృప్తిగా హాయిగా బ్రతుకున్న జనం జీవనంలో ఈ మార్పు అశాంతిని పెంచుతుంది. మంచి మర్యాద, నీతి నిజాయితీలే పరువు ప్రతిష్టలుగా సమాజంలో బ్రతికిన మనుషులు ఇప్పుడు డబ్బులు ఎలా సంపాదించినా పరవాలేదు కాని, ఎంత సంపాదించామనేదే ముఖ్య మనుకుంటున్నారు. అదే స్టేటస్ సింబల్ గా చూస్తున్నారు. ఇది తాత్కాలికమని ఆశిద్దాం. మళ్ళీ మనిషి ప్రశాంతమైన శాంతియుత సహజీవనాన్ని కోరుకునే రోజులు వస్తాయని ఆశిస్తున్నాను.

ఇది మా ఊరి కథే కాదు. ఆంధ్రాలోని చాలా ఊళ్ళ కథ. ఈ విశేషాలన్నీ నేనూ నా ఫ్రెండు , మా ప్రక్కింట్లో నాతో పాటు పెరిగిన లావణ్యేశ్వర రావు కలిసి వ్రాయడం జరిగింది.

మీరు కూడా మీ ఊరి విశేషాలను, మీ జీవన ధృక్పధాన్ని సుజనరంజని ద్వారా అందరితో పంచుకొంటారని ఆశిస్తూ ముగిస్తున్నాను.




పేటేరులో పుట్టి పెరిగిన శ్రీ తిరువీధుల రామకృష్ణ గారు (ఎం.టెక్, కంప్యూటర్ సైన్సు),కొంతకాలం హైదరాబాదులోని ఎన్.ఐ.సి లో పనిచేశారు. ఒరాకిల్ కార్పొరేషన్ లో ఉద్యోగం చేస్తున్నారు. చక్కటి నటుడు, అంకితభావం కలిగిన కార్యకర్త. సిలికానాంధ్ర కార్యక్రమాలన్నింటిలోనూ చురుకుగా పాల్గొనే రామకృష్ణగారు, భార్య ఇందిర పిల్లలు శరత్ చంద్ర, రాణీ ప్రత్యూషలతో క్యుపర్టినోలో నివాసం.

పేటేరులో పుట్టి పెరిగిన బూదాటి లావణ్యేశ్వర రావుగారు హైదరాబాదులో ఆంధ్ర ప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖలో ఇంజినీర్‌గా పనిచేశారు. తరువాత కంప్యూటర్ రంగంలో ప్రవేశించి, సింగపూర్ లో కొంతకాలం పనిచేసి, ప్రస్తుతం కాటర్ పిల్లర్ కార్పొరేషన్‌లో ఉద్యోగం చేస్తున్నారు. భార్య సీత, పిల్లలు పృధ్వి, రోజా లతో టెన్నిసీ లోని నాష్‌విల్లె లో నివాసం

వ్యాస రచనలో సహకరించిన మిత్రుడు శివచరణ్ కి కృతజ్ఞతలు

CLICK HERE FOR MORE PHOTOS